# ఉద్యోగ విరమణ

భావనారాయణ జీవితంలో ఆరోజు మధురస్మృతిగా జీవితాంతమూ నిలబడే రోజు - కాలేజీ ప్రిన్సిపాలుగా ఆయన ఉద్యోగ విరమణ చేస్తున్నాడు.

ఇరవై అయిదేళ్ళ వయస్సులో ఆయన కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగా చేరాడు. పదిహేనేళ్ళ తరువాత 'హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు' అయినాడు. మరో పదేళ్ళ తర్వాత కాలేజీకి ప్రిన్సిపాలుగా నియమించబడ్డాడు. ఇప్పుడాయన వయస్సు అరవయ్యేళ్లు. పదేళ్ళపాటు ప్రిన్సిపాల్ పదవిని నిర్వహించి, 'సెహబాష్' అనిపించుకుని రిటైర్ అవుతున్నాడు.

ఆ సందర్భంలో కాలేజీ ఆడిటోరియంలో సాయంత్రం ఆరుగంటలకు భావనారాయణకు గొప్ప సన్మానసభ ఏర్పాటు చేయబడింది. ఆ సన్మాన సభకు ఓ మంత్రిగారు అధ్యక్షత వహించారు. గౌరవనీయులైన మంత్రిగారు మాట్లాడుతూ ఇలా అన్నారు: "భావనారాయణగారు నాకు గురుతుల్యులు, జీవితాన్ని సంపూర్ణంగా విద్యాబోధనకు అర్పించిన మహనీయులు. తద్వారా వారి దేశసేవ గణనీయమైంది. అందుచేతనే ప్రభుత్వం వారికి బహుమతి నివ్వడం ద్వారా గౌరవించింది. వారి నిస్వార్థసేవ రాష్ట్రపతి దృష్టి నాకర్షించిందంటే ఇంకా వారినిగురించి వేరే శ్లాఘించ నవసరంలేదు."

కాలేజీ గవర్నింగ్ బాడీ కార్యదర్శిగారు ఇలా కొనియాడారు: "ముప్పై అయిదేళ్ళ క్రితం కాలేజీలో ఒక లెక్చరరుగా చేరిన భావనారాయణగారు "హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్' గా ప్రమోట్ చేయబడి, ప్రిన్సిపాల్‌గా నియమించబడి, పదేళ్ళుగా ఆ పదవిలో దివ్యంగా రాణించారంటే — ముఖ్యకారణం వారి అసమాన ప్రజ్ఞాప్రాభవాలే! మేనేజిమెంటు, వారికి అనుకూలంగా, అధ్యాపక వర్గానికి సహకారంగా, విద్యార్థులకు ఉపకారంగా ప్రవర్తించి - కాలేజీకి మంచి పేరు ప్రతిష్ఠల్ని తెచ్చారు."

ఇంకా మునిసిపల్ కౌన్సిల్ ఛైర్మన్‌గారూ, కొత్తగా నియమించబడిన ప్రిన్సిపాలూ, టీచింగ్ స్టాఫ్ సెక్రటరీ, ఇద్దరు లెక్చరర్లూ, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రెసిడెంటూ, స్టూడెంట్సు యూనియన్ ప్రెసిడెంటూ, సెక్రటరీ, ఓ పాత విద్యార్థీ, ఓ పత్రికా విలేఖరీ, ఇద్దరు పుర ప్రముఖులూ, పేరెంట్సు అసోసియేషన్ తాలూకు ప్రతినిధీ - భావనారాయణ ప్రతిభా విశేషాలను గురించీ, కాలేజీకి ఆయన చేసిన సేవలను గురించీ, విద్యార్థులలో పెంపొందించిన క్రమశిక్షణనుగురించీ ఆయన శిక్షణలో విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలను గురించీ, తద్వారా కాలేజీకి వచ్చిన పేరు ప్రఖ్యాతులను గురించీ మాట్లాడారు. ఆయన సజ్జనుడని, శిష్ట స్వభావి అనీ, సద్వర్తనుడనీ, ముక్కుకు సూటిగా పోయేవాడనీ, నిస్వార్థ సేవాపరుడనీ, నీతినిజాయితీలు గలవాడనీ, ప్రతిభా సంపన్నుడనీ, బహుముఖ ప్రజ్ఞాశాలి అనీ, పలురకాలైన విశేషణ వాక్యాలతో ఆ సభలో ఆకాశాని కెత్తడం జరిగింది. పాలవెన్నెల్లాంటి చిరునవ్వు ద్వారా అందరికీ ఉచితరీతిన సమాధానం చెప్పాడు భావనారాయణ.

ఆనాటి సభలో భావనారాయణకు అసంఖ్యాకంగా బహుమానాలు వచ్చాయి. పార్కర్ పెన్, భగవద్గీత, రిస్టువాచీ, అలారం టైంపీస్, గంధపు చెక్క చేతికర్రా, టేబుల్ ఫ్యాన్ మొదలైనవి పేర్కొనదగినవి. చేమంతి పూల దండలతో, చెమికీ హారాలతో ఆయన మెడ నిండిపోయింది. అనేక రకాలైన కోణాల్లో అనేకమంది ప్రముఖుల సమక్షంలో ఫొటోలు తీయబడ్డాయి. రాత్రి ఎనిమిదిన్నరకు జన గణ మన గీతంతో సభ సమాప్తమైంది.

చిన్నకారులో ఒకాయన భావనారాయణను ఇంటి దగ్గర దింపి వెళ్లాడు.

ఉత్సాహం, సంతృప్తి, గర్వాతిశయం, ఆనందం తొణికిసలాడుతూన్న హృదయంతో భావనారాయణ ఇంటి గడపలో అడుగుపెట్టాడు. ఆయన మెడలో ఇంకా పూలదండలూ, చెమికీ హారాలు కులుకుతూనే ఉన్నాయి.

ఇంటిలో ఏదో సందడిగా ఉంది. ఆయన ఉద్యోగ విరమణ సందర్భాన్ని పురస్కరించుకుని హైదరాబాదులో ఉద్యోగాలు చేస్తూన్న ఇద్దరు కొడుకులూ తమ భార్యలతో, పిల్లలతో సహా వచ్చారు. మద్రాసులో ఉద్యోగం చేస్తున్న పెద్ద అల్లుడూ, విజయవాడలో ఉద్యోగం చేస్తున్న రెండో అల్లుడూ కూడా తమ భార్యాపిల్లలతో అంతకు రెండు రోజుల క్రితమే వచ్చారు. పోతే బి. యస్‌సి. చదువుతూన్న మూడో కొడుకూ, పి. యు. సి., స్కూలు ఫైనలు చదువుతూన్న ఇద్దరు కూతుళ్ళూ ఇంటిలోనే ఉన్నారు.

తను కాలేజీలో ఇంత గొప్ప సన్మానం చేయించుకుని, పలువురు ప్రముఖులచే స్తుతించబడి; గొప్పగొప్ప బహుమానాలతో ఇంటికివస్తే – తనకు స్వాగతంచెప్పడానికి వాకిటిలో ఎవ్వరూ లేరే అని భావనారాయణ కొంతసేపు ఆశ్చర్యపోయాడు. కనీసం తన ధర్మపత్ని విశాలక్ష్మమ్మ అయినా గుమ్మందగ్గిర గుమ్మటంలా కూర్చొని తనకోసం ఎదురుచూస్తూ వుండవల్సింది అనుకున్నాడు. కాని ఇంటిలో ఏదో తంతు జరుగుతూండడాన్ని గమనించి కిటికీ చెంతనే నిలబడిపోయి, లోపలి దృశ్యాన్ని తిలకించాడు.

నట్టింటిలో విశాలక్షమ్మ సోఫాకుర్చీపై కూర్చున్నది. రత్నావళి రంగు బెనారస్ పట్టుచీర, పట్టుజాకెట్టు ధరించి, మెడనిండా బంగారు నగలు పెట్టుకుని, నుదుటన ఇంత వెడల్పాంటి కుంకుమ బొట్టుతో, లక్ష్మీదేవి కళతో – పండు ముత్తైదువులా గంభీరమైన చిరునవ్వుతో ఉంది. ఆమె ఎదుటన తివాచీమీద కొడుకులూ, కోడళ్లూ, కూతుళ్లూ, మనమసంతానమంతా కూర్చుని ఉన్నారు.

పెద్దకూతురు శారద ఓ చేమంతి పూలదండ తల్లి మెడలో వేసి, బొట్టు పెట్టి, ఓ కొత్తచీర ఆవిడ చేతుల్లో పెట్టి, గొంతు సవరించుకొని ఉపన్యాసం మొదలెట్టింది! "ఈరోజు మన కుటుంబానికి పర్వదినం. ముప్పైఅయిదేళ్లు సర్వీసుచేసి కుటుంబానికి మూలవిరాట్టు అయిన నాన్నగారు రిటైరు అవుతున్నారు. ఆయనకు కాలేజీలో భారీ ఎత్తున, ఘనంగా సన్మానం జరుగుతున్నది. అందుకు ఆయన అన్ని విధాలా అర్హుడే! కాని ఈ సందరంభలో ముఖ్యమైన ఒక విషయాన్నిఅందరూ మర్చిపోతున్నారు. పట్టించుకోవడంలేదు. నాన్నగారు ఇంతగొప్ప వ్యక్తి కావడానికి కారకులెవ్వరు? ఎవ్వరి సాహచర్యంతో, సేవతో, బలంతో, సహకారంతో నాన్నగారు తన ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నెరవేర్చగలిగారు? ఆ వ్యక్తిని మనం ఈ సందర్భంలో విస్మరించడం తగదు. ఆవిడ కూడా సన్మానానికి అర్హురాలే! అది గుర్తించే నాన్నగారు ఉద్యోగ విరమణ చేసే ఈరోజున ఆయన సహధర్మచారిణి అయిన అమ్మకు ఇక్కడ మన మందరమూ సన్మానం ఏర్పాటు చేశాము..."

తర్వాత పెద్దకోడలు ఉపన్యసించింది: "పాతికేళ్లో, ముప్పైయేళ్లో ఉద్యోగం చేస్తే, లేదా అరవై యేళ్లు వయస్సు నిండితే మగవారికి ఉద్యోగ విరమణ అంటూ ఉంటుంది. ఆపైన వాళ్లు విశ్రాంతి తీసికుంటారు. కాని గృహలక్ష్మికి ఉద్యోగ విరమణ అంటూ ఉండదా? విశ్రాంతి తీసికొనే అవకాశం ఏర్పడదా? ఈ విషయంలో స్త్రీలకు అన్యాయమే జరుగుతూన్నది. ఏమంటారు? కాబట్టి అత్తగారికి ఈనాటి నుంచీ పూర్తిగా విశ్రాంతి తీసికొనే .ఏర్పాట్లు మనం చెయ్యాలి. ఆవిడ చేత వంటపనిగానీ, పాచిపనిగానీ, మరే యితరమైన పనులుగానీ చేయించరాదు. మామగారివలె ఆవిడకూడా విశ్రాంతి తీసికుంటూ, సుందరమైన ప్రదేశాలు కులాసాగా చూస్తూ, కాలుమీద కాలు వేసికొని, కావాలని అనుకున్నదల్లా భుజిస్తూ సుఖపడాలి. ఈ బాధ్యతను కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ, స్వీకరించాలి......"

అందరూ సంతోషం వెల్లివిరిసేటట్లు చప్పట్లు కొట్టారు.

అంతలో పెద్ద మనుమరాలు కిటికీచెంత నిలబడ్డ తాతయ్యనుచూసి, "తాతయ్య వచ్చాడు! తాతయ్య వచ్చాడు!" అని కేకవేసింది.

సోఫాలో కూర్చున్న విశాలాక్షమ్మ సిగ్గుతో దిగ్గున లేచింది. అందరూ లేచారు.

భావనారాయణ ఇంటిలోకి వచ్చాడు. ఆయన నేత్రాలు ఆనందాశ్రువులతో నిండిఉన్నాయి. అందరినీ కూర్చోమని సంజ్ఞ చేశాడు. అందరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు

తన మెడలోని దండలన్నీ తీసి భార్య మెడలో వేశాడు భావనారాయణ. "కాలేజీలో నాకు ఘనంగా సన్మానం జరిగింది. అదంతా ఒక ఎత్తు, ఇప్పుడు నా అర్ధాంగికి జరిగిన సన్మానం మరోఎత్తు. నేనుగూడా యీవిడ సేవల్ని గుర్తించి, సన్మానిస్తున్నాను గనుక ఈ సన్మానమే ఘనమైనది. ఈ శుభసమయంలో నాకు మీరంతా మంచి గుణపాఠం నేర్పారు.

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల శ్రమను మర్చిపోవడం సమంజసమా! అన్నాడు భావనారాయణ పైపంచెతో ఆనంద బాష్పాలను అద్దుకుంటూ.

(ప్రతిజ్ఞ)

—o—